క్లుప్తంగా

కొలు రైతు సంఘం జిల్లా మహాసభ రేపు

కారంచేడు: కొలు రైతుల సమస్యలపై చర్చించేందుకు, వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన అనేక విషయాలపై బాపట్ల జిల్లా కొలు రైతుల మహాసభను స్వర్ణలో నిర్వహించనున్నట్లు కొలు రైతు సంఘం నాయకులు పి. కొండయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుత పరిస్థితుల్లో కొలు రైతుల అనేక సమస్యలపై సంఘం నిరంతరం పోరాటం చేస్తుందన్నారు. ఈనెల 20వ తేదీన మండలంలోని స్వర్ణ గ్రామంలో ఆర్య వైశ్య కల్యాణ మండపంలో జరిగే ఈ సభకు రాష్ట్ర స్థాయి నాయకులు హాజరవుతారని, జిల్లాలోని అన్ని మండలాల, ప్రాంతాల నుంచి కొలు రైతులు పెద్ద ఎత్తున హాజరుకావాలని కోరారు.

అర్జీల విచారణలో అలసత్వం వద్దు

చీరాల టౌన్: ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న పీజీఆర్ఎస్ కార్యక్రమంలో వచ్చిన అర్జీలను నిర్ణీత సమయంలోగా విచారించి పరిష్కరించాలని తహసీల్దార్ కుర్రా గోపికృష్ణ సూచించారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో గ్రామ, పట్టణ వీఆర్వోలు, రెవెన్యూ సిబ్బందితో సమావేశాన్ని నిర్వహించారు. గ్రామాలు, సచివాలయాల పరిధిలో పెండింగ్‌లో ఉన్న అర్జీలు, పాస్ పుస్తకాలు, స్పందన అర్జీలపై సమావేశాన్ని నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ గ్రామాల్లో, సచివాలయాల్లో పనిచేసే వీఆర్వోలు ప్రజలకు అందుబాటులో ఉండటంతో పాటు స్పందన అర్జీలను త్వరగా విచారించాలని కోరారు. ప్రజలకు జవాబుదారీతనంగా రెవెన్యూ ఉద్యోగులు పనిచేయాలని, విధుల్లో అలసత్వం వహించిన వారిపై శాఖపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామాల వారీగా పెండింగ్‌లో ఉన్న పట్టాదారు పాస్ పుస్తకాలను త్వరగా అందించడంతో పాటు గ్రామాల్లో అనధికార లే అవుట్లు వేయకుండా కట్టడి చేయాలన్నారు. నీటి తీరువా వసూళ్లు వేగవంతం చేయాలన్నారు. ఇన్‌చార్జి డీటీ సుశీల, ఆర్ఐలు శేఖర్, సత్యం, వీఆర్వోలు ఉన్నారు.

శింగరకొండ దర్శిని

అద్దంకి: క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం ఆషాఢ మాసం అశ్వని నక్షత్రం నవమి సందర్భంగా శనివారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ తిమ్మనాయుడు శుక్రవారం తెలిపారు. క్షేత్ర ప్రాధాన్యం ఉన్న శనివారం ఆంజనేయ స్వామికి ఇష్టమైన ఆకు పూజ చేస్తే కోరిన కోర్కెలు నెరవేరుతాయని చెప్పారు. ఉదయం బిందె తీర్థం, మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచ హారతుల పూజ నిర్వహిస్తారు. సాయంత్రం 5.30 గంటలకు శ్రీ సువర్చలా సహిత దక్షిణాభిముఖ ప్రసన్నాంజనేయ స్వామి ఉత్సవ మూర్తులకు పల్లకీ సేవ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.

ఔషధ మొక్కలతో ఆరోగ్య భద్రత



మాట్లాడుతున్న ఎంఈఓ శ్రీనివాసరావు

అద్దంకి: ఔషధ మొక్కలతో భావి తరాలకు ఆరోగ్య భద్రత కలుగుతుందని ఎంఈఓ ఏ. శ్రీనివాసరావు అన్నారు. ఐఈఈఆర్‌డీ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం మండలంలోని తిమ్మాయపాలెం గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఔషధ మొక్కల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. దానిలో భాగంగా తులసి, అశ్వగంధ, శతావరి, ఆలోవీరా, మందార, ఎర్రచందనం, వాబమాకు, అలచరణపాల మొదలైన 30 మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ ఔషధ మొక్కలు ఎంతో మేలు చేస్తాయని తెలిపారు.

హామీలు నెరవేర్చని చరిత్రకారుడు బాబు

- ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి
- బాబు ష్యూరిటీ– మోసం గ్యారెంటీలో చీరాల ఇన్‌చార్జి కరణం



మాట్లాడుతున్న నియోజకవర్గ ఇన్‌చార్జి వెంకటేష్‌బాబు

చీరాల టౌన్: 'ఇచ్చిన హామీలు విస్మరించడం.... మ్యానిఫెస్టోని కనిపించకుండా చేయడం...ప్రశ్నించిన వారిపై దాడులకు పాల్పడటం సీఎం చంద్రబాబు నైజం. ఆచరణ సాధ్యం కాని హామీలిచ్చి ప్రజలను మోసం చేయడంలో చంద్రబాబును మించిన వారు చరిత్రలో లేరు' అని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్ బాబు అన్నారు. శుక్రవారం ఈపురుపాలెం నేతాజీ యూనియన్‌లో చీరాల మండల స్థాయిలో ×బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ¥ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చి ప్రజల సంక్షేమానికి కట్టుబడి పనిచేసిన మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాటకు, హామీకి విలువనిచ్చే ఏకైక వ్యక్తిగా చరిత్రలో నిలిచారన్నారు. కానీ ప్రస్తుత సీఎం చంద్రబాబు ఎన్నికలకు ముందు ఇచ్చిన ప్రతీ హామీని పక్కన బెట్టి ప్రజలను మోసం, నయవంచనకు గురిచేస్తున్నారన్నారు. గత ప్రభుత్వ హయాంలో పేదల విద్య, వైద్యం , సంక్షేమానికి, గ్రామ, పట్టణ అభివృద్ధికి, ఉద్యోగాల కల్పనకు, పరిశ్రమల స్థాపనకు విశేష కృషి చేశారని తెలిపారు. కానీ ప్రస్తుత సీఎం మాత్రం ప్రజలకు ఇచ్చిన హామీలను గాలికొదిలేసి కేవలం ప్రతిపక్ష పార్టీ నేతలపై దాడులకు పాల్పడటమే ధ్యేయంగా పనిచేస్తున్నారన్నారు. గడిచిన 14 నెలల కాలంలో ప్రజలు ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీల్లో కనీసం సగం కూడా నెరవేర్చకుండా అన్నీ చేసేశాం ... అభివృద్ధిలో ముందంజలో ఉన్నామని ప్రగల్భాలు పలకడం హాస్యాస్పదమన్నారు. కరోనా లాంటి విపత్కర సమయాల్లో పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతకు అండగా నిలిచిన అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహనరెడ్డిని ప్రజలు విస్మరించి తమ సంక్షేమానికి తామే అడ్డుకున్నారనే అభిప్రాయానికి వచ్చారన్నారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న అక్రమాలు, అరాచకాలను ప్రజలంతా గమనిస్తూనే ఉన్నారని రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ప్రభంజనానికి చంద్రబాబు పతనానికి ఈ ఎన్నికలే దిక్సూచీలా పనిచేస్తాయన్నారు. పార్టీకి కార్యకర్తలే బలమని, చీరాల నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీకి పూర్వవైభవం తీసుకువచ్చేందుకు ప్రతి కార్యకర్త, నాయకుడు పనిచేయాలన్నారు. 2029 ఎన్నికలే లక్ష్యంగా, సీఎంగా మళ్లీ జగనన్నను గెలిపించుకునేందుకు సమష్టిగా పనిచేయాలన్నారు. చంద్రబాబు మోసపూరిత సర్కారు హామీలను ఎండగట్టాలని ప్రజలకు సూచించారు. చీరాల నియోజకవర్గం తన సొంత నియోజకవర్గమన్నారు. నాయకులను, కార్యకర్తలను వేధిస్తే అందుకు అనుగుణంగా పోరాటాలుచేద్దామని పిలుపునిచ్చారు.

కుతంత్రాలకు మోసపోయిన ప్రజలు

దేవాంగ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బీరక సురేంద్ర మాట్లాడుతూ గత ఐదేళ్లలో రాష్ట్ర ప్రజలను సొంత బిడ్డల్లా చూసుకుని అందరికీ సంక్షేమ పథకాలు, రాష్ట్ర అభివృద్ధిని ప్రణాళికాబద్ధంగా పని చేశారన్నారు. అయితే అప్పటి సీఎం జగన్ననను మరిచి కుతంత్రాలు చేసే చంద్రబాబు హామీలకు నమ్మి ప్రజలు మోసపోయారన్నారు. చేనేతలు అధికంగా ఉన్న చీరాల నియోజకవర్గంతో పాటు రాష్ట్రంలో మగ్గం ఉన్న ప్రతి చేనేత కార్మికుడికి ఇచ్చిన హామీ ప్రకారం చేనేతలకు నేతన్న నేస్తం క్రింద ఏడాదికి రూ.24వేలు చొప్పున ఐదేళ్లు అందించి చేనేతలకు అండగా నిలిచిన జగనన్నకు అందరం అండగా నిలవాలన్నారు. చంద్రబాబు ఇచ్చిన మోసపూరిత హామీలను ప్రజలు ఎండగట్టాలని, అలివికాని హామీలిచ్చి కొన్ని అరకొరగా అమలు చేసి చేతులు దులుపుకున్న చంద్రబాబు సర్కార్‌కు దీటైన విధంగా ప్రజలు జవాబు చెప్పాలన్నారు. అనంతరం నూతనంగా ఏర్పడిన చీరాల మండల కమిటీ నాయకులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు గవిని శ్రీనివాసరావు, రైతు విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు కె.రమణా రెడ్డి, ఎస్సీ సెల్ అధ్యక్షులు వాసిమళ్ల వాసు, మండల పార్టీ అధ్యక్షుడు బి.చిన అద్దంకి రెడ్డి, ఉపాధ్యక్షులు రామచంద్రుడు, పి.వెంకటసుబ్బయ్య, పి.శ్రీనివాసరావు, పి.వెంకట సుబ్బారావు, రాజవర్ధన్‌రాజు, సయ్యద్ నాగూర్‌వలి, నాగరాజు,మార్కు, వెంకటేష్, రామిరెడ్డి, శ్రీనుబాబు, పార్టీ సీనియర్ నాయకులు అంకాళరెడ్డి, ధనుంజయ, బిట్రా శ్రీనివాసరావు, జి.సుధాకర్, బి.సాంబశివరావు, ఎ.శ్రీనివాసరెడ్డి, కుమార్‌బాబు, రత్నారెడ్డి, శ్రీనివాసరావు, జయరావు, పిట్టు పోలయ్య, అధికసంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.



వెంకటేష్‌ను గజమాలతో సత్కరిస్తున్న మండల పార్టీ నూతన కమిటీ నాయకులు, కార్యకర్తలు

చిన్నారులకు ఉపకరణాల పంపిణీ



కారంచేడులో చిన్నారులకు పరికరాలు అందిస్తున్న ఎంఈఓ



ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు ఉపకరణాలు అందిస్తున్న ఎంఈఓలు

కారంచేడు: మండలంలోని అన్ని గ్రామాల పరిధిలో ఉన్న ప్రత్యేక అవసరాలు కలిగిన చిన్నారులకు ప్రభుత్వం ఉపకరణాలను అందిస్తుందని ఎంఈఓలు ఎంవీ సత్యన్నారాయణ, మొలబంటి వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన కారంచేడు ఉర్దూ పాఠశాల ఆవరణలో ఉన్న భవిత కేంద్రం వద్ద విద్యార్థులకు అవసరమైన బ్యాటరీ, మోటర్ ట్రైసైకిల్స్, వినికిడి యంత్రాలు, వీల్‌చైర్స్, టీఎల్ఎం కిట్లు వంటికి అందిస్తున్నామని పేర్కొన్నారు. ప్రత్యేక అవసరాలు కలిగిన చిన్నారులను చులకనగా చూడవద్దన్నారు. వారిపట్ల జాలి కాదని, వారిని ప్రేమతో హత్తుకోవాలని అన్నారు. అంగవైకల్యంతో ఉన్న వారిని చూసిన ప్రజలు జాలి చూపిస్తారని తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎం షేక్ హుస్సేన్‌సాహెబ్, సహిత ఉపాధ్యాయుడు జి. వసంతబాబు, స్కూల్ అసిస్టెంట్ ఎం. సంధ్య, నాగూర్‌బీ పాల్గొన్నారు.

ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు ఉపకరణాల పంపిణీ

చినగంజాం: మండలంలోని ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు శుక్రవారం ఉపకరణాలను అందజేశారు. మండల విద్యావనరుల కేంద్రంలో బాపట్ల సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో రూ. 57 వేల విలువ కలిగిన వివిధ రకాల ఉపకరణాలు వీల్‌చైర్స్, హియరింగ్ ఎయిడ్స్ ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు పంపిణీ చేశారు. మండల విద్యాశాఖాధికారి 1 బీ అజయ్‌బాబు, ఎంఈఓ 2 ఎన్ కోటేశ్వరరావు పిల్లలకు అందజేశారు. సహిత విద్యా ఉపాధ్యాయులు టి. బాలకృష్ణ, డి. నాగార్జున, బి. సుబ్బరాజు, ఎమ్మార్సీ సిబ్బంది, మండలంలోని పలు గ్రామాలకు చెందిన పిల్లలు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పత్తి రైతులు ప్రీమియం చెల్లించాలి

బల్లికురవ: ఖరీఫ్‌లో పత్తిపంట సాగుచేసే రైతులు వాతావరణ ఆధారిత పంటల బీమా పథథకంలో జూలై 31వ తేదీలోపు ప్రీమియం చెల్లించాలని వ్యవసాయాధికారి పి. శ్రీనివాసరావు శుక్రవారం తెలిలిపారు. బాపట్ల జిల్లాకు ప్రతిపంటను ఎంపిక చేశారని ఎకరాకు రూ. 1900 ప్రీమియం చెల్లిస్తే విపత్కర పరిస్థితుల్లో పంట నష్టం జరిగితే రూ. 38 వేలు పరిహారం పొందవచ్చని తెలిపారు.

వసతి గృహానికి ఫ్యాన్లు వితరణ

వేటపాలెం: స్థానిక గొల్లపూడి వారి వీధిలోగల జీవీకే వసతి గృహనికి దాతలు సమ కూర్చి ఫ్యాన్లు శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా పట్టభద్రుల సంఘం అధ్యక్షుడు ప్రత్తి వెంకట సుబ్బారావు మాట్లాడుతూ గుంటూరుకు చెందిన గుడిపూడి వెంకట సురేష్, నరేష్ కుమార్‌లు సమకూర్చిన ఫ్యాన్లు వసతి గృహానికి అందజేసినట్లు తెలిపారు. అనంతరం వసతి గృహంలోని విద్యార్థులకు అల్పాహారం అందజేశారు. వంకా రవికు మార్, బొంబాయి సురేషు, గుడిపూడి వెంకట సురేషు, నరేష్‌కుమార్, సూర్యకుమారి, శైలజ, సుకన్య పాల్గొన్నారు.

కొనసాగుతున్న మున్సిపల్ కార్మికుల సమ్మె



సమ్మెలో ఒంటి కాలిపై నిలబడి నిరసన తెలుపుతున్న కార్మికులు

అద్దంకి రూరల్: న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ 6 రోజులుగా సమ్మె నిర్వహిస్తున్న మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు శుక్రవారం ఉదయం ఒంటి కాలిపై నిలబడి నిరసన వ్యక్తం చేశారు. సమ్మెకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ఐక్యవేదిక రాష్ట్ర నాయకులు జ్యోతి రమేష్, చెన్నుపల్లి నాగేశ్వరరావు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులను కాలరాసే విధంగా ప్రభుత్వాలు అవలంబిస్తున్నాయన్నారు. ప్రభుత్వం వెంటనే పరిష్కరించేందుకు ముందుకు రావాలన్నారు. తంగిరాల వెంకటేశ్వర్లు, పి. ఆదాం, శ్యామ్యూల్, కె.మారతి, జి. మార్కు, రాజ్యలక్ష్మీ పాల్గొన్నారు.

మురుగుతో తిప్పలు



వర్షపు నీరు, మురుగు నీరు కలిసి దుర్గంధం వెదజల్లుతున్న ప్రాంతం



సైడు కాలువలు లేక రోడ్లపై నిలిచి పోయిన వర్షపు నీరు

చినగంజాం: పంచాయతీ పరిధిలోని మసీదు పేట, చుండి బజారుల్లో మురుగు కాలువలు లేక ఆయా కాలనీల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సిమెంట్ రోడ్లు అయితీ వేవారే కానీ సైడు కాలువలు తీయడం మరచి పోయారు. కాస్తంత వర్షం కురిస్తే చాలు రోడ్లన్నీ జలమయమై కాలనీ వాసులు నడచేందుకు కూడా ఇబ్బందిగా మారింది. అంతే గాకుండా వర్షం నీరు, నివాస గృహాల నుంచి వచ్చే మురుగు నీరు కలిసి పోయి దుర్వాసన వెదజల్లుతూ స్థానిక నివాస గృహాల వారు నిలువలేని పరిస్థితి తలెత్తింది. దాంతో మురుగు నీరు ఎక్కువ కాలం రోడ్లపై నిలువ ఉండటంతో దోమలు వ్యాప్తి చెంది తమ తీవ్ర అసౌకర్యాన్ని కలుగు జేస్తున్నాయని ప్రజలు వాపోతున్నారు. ఇలాంటి పరిస్థితిలో ప్రజాప్రతినిధులు పట్టించుకొని కాలనీలో డ్రేనేజీ నీరు పోయేందుకు సైడు కాలువలు ఏర్పాటు చేసి ఆదుకోవాలని వారు కోరుతున్నారు.

చెత్త సేకరణలో జాప్యం వద్దు



క్లాప్ సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న ఎంపీడీఓ

అద్దంకి: ఇంటి చెత్త సేకరించడంలో జాప్యం వద్దని ఎంపీడీవో శింగయ్య అన్నారు. ఐవీఆర్ఎస్ కాల్స్‌లో కేవలం 27 శాతం మాత్రమే సంతృప్తి వ్యక్తం చేసిన మోదేపల్లి గ్రామాన్ని శుక్రవారం సందర్శించారు. క్లాప్ మిత్రలకు చెత్త సేకరణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెత్తను పేరుకుపోయేలా చేయడం వలన గ్రామం అపరిశుభ్రంగా మారుతుందన్నారు. తద్వారా రోగాలు రావడానికి అవకాశం ఉందని చెప్పారు. గ్రామ ప్రజలు సిబ్బందికి సహకరించి చెత్తను క్లాప్ మిత్రలకు అందుబాటులో ఉంచాలని చెప్పారు. గ్రామ పంచాయతీ సెక్రటరీ, సిబ్బంది పాల్గొన్నారు.

104 సేవలు సద్వినియోగం చేసుకోండి



104 క్యాంపును సందర్శించిన జిల్లా కో ఆర్డినేటర్ డాక్టర్ ప్రవీణ్ తదితరులు

చినగంజాం: 104 సంచార వాహనం ద్వారా అందిస్తున్న వైద్యసేవలను వినియోగించుకోవాలని ఎన్టీఆర్ వైద్యసేవ ట్రస్ట్ జిల్లా కో ఆర్డినేటర్ డాక్టర్ ప్రవీణ్ సూచించారు. శుక్రవారం కడవకుదురులో 104 సంచార వాహన క్యాంపును ఆకస్మికంగా తనిఖీ చేశారు. గర్భిణులు, బాలింతలకు, మలేరియా, డెంగీ గురించి సలహాలు ఇచ్చారు. ప్రజల వద్దకు నేరుగా వస్తున్న 104 సంచార వాహన సేవలను వినియోగించుకొని ఆరోగ్య పరంగా మెరుగ్గా ఉండేలా చూసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్ కె. కీర్తి సరోజ్, 104 డీఎం ఐ. నాగేశ్వరరావు, 104 డీఈఓ పాదిలి రాఘవ, ఎంఎల్‌హెచ్‌పీ రమ్య, ఏఎన్ఎం ఎం. శారద, అంగన్‌వాడీ, ఆశ వర్కర్‌లు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేయండి



మండల సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ కోమట్ల అంకమ్మరెడ్డి

చినగంజాం: ప్రజలెదుర్కొంటున్న సమస్యలను అధికారులు సత్వరం పరిష్కరించేందుకు కృషి చేయాలని ఎంపీపీ కోమట్ల అంకమ్మరెడ్డి అన్నారు. మండల సర్వసభ్య సమావేశం శుక్రవారం మండల పరిషత్ సమావేశ భవనంలో ఎంపీపీ కోమట్ల అంకమ్మరెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. మండల పరిధిలోని అన్ని శాఖలకు సంబంధించిన అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అధికారులు ఆయా శాఖల పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులు, కొత్తగా వచ్చిన పథకాలు గురించి వివరించారు. ప్రభుత్వం కొనుగోలు చేసిన వారికి సంబంధించి లబ్ధిదారులకు నగదు చెల్లింపులో జాప్యం జరిగిందని వెంటనే రైతులకు నగదు చెల్లింపు చేయాలని కొత్తపాలెం సర్పంచ్ ఆసోది బ్రహ్మానందరెడ్డి వ్యవసాయాధికారిని కోరారు. చినగంజాంలో పలు ప్రయివేట్ వాటర్ ప్లాంట్‌లు సరైన ప్రమాణాలు పాటించడం లేదని ఆరోగ్య శాఖ తరపున పర్యవేక్షించాలని వైద్యాధికారిని కోరారు. విద్యా ప్రమాణాలు పాటించకుండా ప్రయివేట్ పాఠశాలలు నడుపుతున్న వారిపై విద్యాశాఖ చర్యలు తీసుకోవాలని ఆయన సభలో అధికారులను కోరారు. కొత్తపాలెం పంచాయతీ పరిధిలో అంగన్‌వాడీ భవనం శిథిలావస్థకు చేరిన దృష్ట్యా కొత్త భవనం మంజూరు చేయించాలని ఆయన కోరారు. మోటుపల్లి సచివాలయం పరిధిలో విధులు నిర్వహిస్తున్న ఇంజినీరింగ్ అసిస్టెంట్ గృహనిర్మాణ లబ్ధిదారులను తప్పుదోవ పట్టిస్తున్నాడని ఆర్థికపరమైన ఇబ్బందులకు గురి చేస్తున్నాడని అతనిపై చర్యలు తీసుకోవాలని మోటుపల్లి సర్పంచ్ వడ్లమూడి సాంబశివరావు సభలో అధికారుల దృష్టికి తీసుకు వచ్చారు. చినగంజాం టౌన్ పరిధిలో తరచుగా కరెంటు కోత ఉంటుందని పరిష్కారం చూపాలని కో ఆప్షన్ సభ్యుడు మహ్మద్ ఆ శాఖాధికారులను కోరారు. సర్వ సభ్య సమావేశానికి గైర్హాజరైన అధికారులకు మెమోలు పంపించేందుకు చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎస్. విజయ, తహసీల్దార్ జీవిగుంట ప్రభాకరరావు, వైస్‌ఎంపీపీలు కాటుకూరి బాబురావు, తుమ్మలపెంట ప్రసన్నలక్ష్మి వ్యవసాయాధికారి ఆర్. చంద్రశేఖర్, వైద్యాధికారి పి. సాయిశ్రీ చరణ్, ఏఈపీఆర్ దాసు, హౌసింగ్ ఏఈ రాజశేఖర్ , సీడీపీఓ సులోచన, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రాణి, ఏపీఎం సుబ్బారావు, విద్యాశాఖాధికారులు బి. అజయ్‌బాబు, ఎన్. కోటేశ్వరరావు, ఎంపీటీసీలు, గ్రామ సర్పంచ్‌లు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

చీరాల టౌన్: పంచాయతీల కార్యదర్శులు విధులను సమర్థవంతంగా నిర్వహించి గ్రామ పంచాయతీలను అభివృద్ధిలో ముందంజలో ఉంచాలని ఎంపీడీఓ బి.శివన్నారాయణ సూచించారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ పంచాయతీల సెక్రటరీలు, గ్రామ సచివాలయాల వెల్ఫేర్, డిజిటల్ అసిస్టెంట్లతో సమావేశాన్ని నిర్వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూ మండల పరిధిలోని 15 గ్రామ పంచాయతీల పరిధిలోని గ్రామ సచివాలయాలను తనిఖీలు చేసి పెండింగ్ అర్జీలను విచారించినట్లు తెలిపారు. ప్రజలు వచ్చిన అర్జీలను నిశితంగా విచారించి అర్హులైన ప్రతి ఒక్కరి సమస్యకు పరిష్కారం అందించాలన్నారు. గ్రామ సచివాలయాల ఉద్యోగులు అంకితభావంతో విధులు నిర్వహించాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులకు విధిగా అందించడంతో పాటు సచివాలయానికి వచ్చే ప్రజలకు జవాబుదారీగా పనిచేసి మంచి పేరు తెచ్చుకోవాలన్నారు. ప్రజలకు అందించే సేవల్లో అలసత్వం వహించిన వారిపై చర్యలు తప్పవన్నారు. ఈవోఆర్డీ రామకృష్ణ, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయాల వెల్ఫేర్ అసిస్టెంట్లు, డిజిటల్ అసిస్టెంట్లున్నారు.

సంఘాల బలోపేతమే లక్ష్యం



బల్లికురవలో మాట్లాడుతున్న డీపీయం రవీంద్ర

బల్లికురవ: గ్రామ సంఘాలు ప్రతి నెలా 15వ తేదీలోపు సమావేశాలు ఏర్పాటుతో స్వయం ఉపాధికి యూనిట్ ఎంపికచేసుకుని బలోపేతం కావాలని బాపట్ల జిల్లా ఎల్‌హెచ్‌డీపీయం రవీంద్ర కోరారు. శుక్రవారం స్థానిక మహిళా సమాఖ్య కార్యాలయంలో వీవోఏలతో జరిగిన సమావేశంలో మాట్లాడారు. పొదుపు గ్రూపులోని ప్రతి సభ్యురాలు స్వయం ఉపాధికి గొర్రెలు, మేకలు, గేదెలు, కోళ్లు, కిరాణా, టైలరింగ్‌లు ఎంపిక చేసుకోవాలన్నారు. పెరటి కూరగాయల పెంపకంతోపాటు మునగ సాగు చేసే రైతుల నుంచి విత్తనాలకు సేకరించాలన్నారు. త్వరలో జిల్లా కేంద్రంలో వివిధరకాల మందుల్లో మునగను సేకరించే యూనిట్లు ఏర్పాటు చేస్తామని చెప్పారు. పీయంఈజీపీ, పీయం ఎఫ్‌యంఈ, ముద్రా, నారీ శక్తి రుణాల పొందేందుకు లబ్ధిదారుల ఎంపిక చేపట్టాలన్నారు. సమావేశంలో ఎఫ్‌పీవో ఏపీయం రవి, ఏపీయం బి. రాజారావు, శ్రీనిధి మేనేజర్ శ్రీనివాసరావు, మహిళా సమాఖ్య అధ్యక్షురాలు రమాదేవి, సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలలో వర్షపు నీరు



కోటపాడు పాఠశాలలో నిలిచిన వర్షపు నీరు

జె.పంగులూరు: మండల పరిధిలోని కోటపాడు, కల్లంవారిపాలెం, పంగులూరు పాఠశాలలో కొద్దిపాటి వర్షానికే వర్షపు నీరు నిలిచిపోయాయి. గురువారం రాత్రి సమయంలో పడిన వర్షానికి కోటపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పూర్తిగా నీటితో నిండిపోయింది. విద్యార్థులు తరగతి గదులలోకి వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారు.

ప్రభుత్వ వైఫల్యాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలి

- నమ్మి ఓటేసిన ప్రజలు మోసపోయారు
- బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ సభలో నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్‌బాబు

చీరాల అర్బన్: ఎన్నికల ముందు అమలు కాని హామీలతో ప్రజలను నమ్మించి కూటమి ప్రభుత్వం ఓట్లు దండుకుని ప్రజలను మోసం చేసిందని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్‌బాబు ధ్వజమెత్తారు. శుక్రవారం సాయంత్రం పేరాలలోని గోలి సదాశివరావు కళ్యాణమండపంలో బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ సభను నిర్వహించారు. కార్యక్రమానికి పార్టీ పట్టణ అధ్యక్షుడు యాతం మేరిబాబు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా పార్టీ ఇన్‌చార్జి కరణం వెంకటేష్‌బాబు మాట్లాడుతూ సూపర్ సిక్స్ పేరుతో ఎన్నికల ముందు ఎన్నో పథకాలు ప్రకటించి ఎన్నికల తర్వాత వాటిని అమలు చేయకుండా మోసం చేస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వ ఏడాది పాలనలో యువత, నిరుద్యోగులు, మహిళలు, రైతులు, బీసీలను ఇలా అన్ని వర్గాలను మోసం చేసిందన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేయకుండా సుపరిపాలన పేరుతో ప్రజల వద్దకు వెళ్లి అన్ని అమలు చేశామని గొప్పలు చెప్పుకుంటున్నారని ఎద్దేవా చేశారు. పెన్షన్ నగదును పెంపు చేశామని గొప్పలు చెప్పుకుంటున్న నేతలు.. తొలగించిన పెన్షన్ల సంగతి గురించి మాత్రం మాట్లాడడం లేదన్నారు. తల్లికి వందనం పేరుతో ప్రచారం హోరెత్తించి సంవత్సరం తర్వాత అందించారని, అది కూడా కొంత మందికి అందలేదన్నారు. ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఓటమి చెందినా ఓటు బ్యాంకు మాత్రం పార్టీకి తగ్గలేదన్నారు. ఎనిమిది నెలల పదవీకాలం ఉన్న మున్సిపాలిటీలో చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికలు నిర్వహించారన్నారు. పార్టీ సింబల్‌పై గెలిచి ప్రస్తుతం పదవులు చేపట్టిన వారందరూ వైఎస్సార్‌సీపీకి చెందిన వారేనని, వారికి పార్టీ తరుపున అభినందనలు తెలుపుతున్నామంటూ చురకలు వేశారు. పదవులు ముఖ్యం కాదని నమ్మి ఓటేసిన ప్రజలకు ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. రానున్న మున్సిపల్ ఎన్నికలకు వార్డుల్లో, స్థానిక సంస్థల ఎన్నికలకు కమిటీలను ఏర్పాటు చేసి సంసిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. దేవాంగ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బీరక సురేంద్ర మాట్లాడుతూ క్యూ ఆర్ కోడ్‌ను ఫోన్లలో స్కాన్ చేసి చంద్రబాబు మేనిఫెస్టోలో ఇచ్చిన పథకాలు ఇవ్వకపోవడం వలన ప్రజలు ఏ విధంగా నష్టపోతున్నారో వివరించాలన్నారు.

అనంతరం చంద్రబాబు మోసాలను తెలియజేసే క్యూర్ కోడ్ కలిగిన పత్రాలను ఆవిష్కరించారు. బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు గవిని శ్రీనివాసరావు, ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షులు వాసిమళ్ళ వాసు, మాజీ మున్సిపల్ వైస్‌చైర్మన్ బొనిగల జైసన్‌బాబు, యువజన విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు కోడూరి ప్రసాద్‌రెడ్డి, మున్సిపల్ వింగ్ అధ్యక్షుడు బత్తుల అనిల్, రాష్ట్ర మైనార్టీ విభాగం సెక్రటరీ షేక్ కబీర్, నియోజకవర్గ మహిళా విభాగం నాయకురాలు ఎం .సీతామహాలక్ష్మి, నియోజకవర్గ రైతు విభాగం అధ్యక్షుడు కె.రమణారెడ్డి, వాణిజ్య విభాగం అధ్యక్షుడు సీహెచ్. బాలకృష్ణ, లీగల్ సెల్ రాజు వెంకటేశ్వరరెడ్డి, కౌన్సిలర్లు కంపా అరుణ్, తోకల అనిల్, పట్టణ జాయింట్ సెక్రటరీ జాన్ చిరంజీవి, బూత్ లెవల్ కన్వీనర్ శిఖా సురేష్ పాల్గొన్నారు.



క్యూ ఆర్ కోడ్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న పార్టీ నాయకులు



పేరాలలో మాట్లాడుతున్నకరణం వెంకటేష్ బాబు